క్లుప్తంగా

నాడు-నేడు పనులు నాణ్యతతో జరిగేలా చూడాలి



మాట్లాడుతున్న ఎంఈవో వేణుగోపాలరావు

మునగపాక : నాడు-నేడు సక్రమంగా నాణ్యంగా అమలు జరిగేలా చూడాలని ఎంఈవో-1 వేణుగోపాలరావు కోరారు. మునగపాక మండల పరిషత్ హాలులో సోమవారం సాయంత్రం ప్రాథమిక,ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లిప్ కార్యక్రమం విజయవంతం కావాలన్నారు. ఎన్నికలకు సంబంధించి గుర్తించిన పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించేలా చూడాలన్నారు. ఎంఈవో-2 శివనాయుడు, సీఆర్ఎంటీలు లక్ష్మీనారాయణ, సత్తిబాబు, గోవింద, నూకేష్, అచ్యుత కృష్ణ సమావేశంలో పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ



కుష్టు వ్యాధిపై ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పాయకరావుపేట : మండలంలో గల పీఎల్ పురం గ్రామంలో కుష్ఠువ్యాధి నివారణపై పాయకరావుపేట పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్పర్శ కుష్ఠు వ్యాధిపై ప్రచారం నిర్వహించారు. కుష్టు వ్యాధి సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం పలువురికి డయాబెటిక్ వ్యాధి పరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు సూపరింటెండెంట్ ఎం.నాగేశ్వరరావు, ఎంపీహెచ్‌వో రమణ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

శ్మశాన వాటికను అభివృద్ధి చేస్తాం



తోటాడ శ్మశానవాటికలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న దృశ్యం

మునగపాక : తోటాడ శ్మశానవాటికను అభివృద్ధి చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ నేత దొడ్డి కోటేశ్వరరావు తెలిపారు. చెత్తా చెదారంతో డంపింగ్ యార్డును తలపిస్తున్న శ్మశాన వాటికలో జేసీబీతో జరుగుతున్న పనులను పంచాయతీ పాలకవర్గం సోమవారం పరిశీలించింది. శ్మశాన వాటికను అనుకొని ప్రధాన రహదారి ఉండడంతో దుర్వాసన రాకుండా చర్యలు తీసుకుంటున్నామని కోటేశ్వరరావు తెలిపారు. రోడ్డును ఆనుకొని ప్రధాన కాలువ నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. వార్డు సభ్యుడు బుద్ద రమేష్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శి కాండ్రేగుల లక్ష్మీనారాయణలు ఆయన వెంట పాల్గొన్నారు

తిమ్మరాజుపేటలో నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేటలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో ఎం.మన్మథరావు ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మన్మథరావు కోరారు.

నేవీ నిర్వాసితులకు చెక్కుల పంపిణీ నేడు

రాంబిల్లి: నేవీ నిర్వాసితులకు మంగళవారం ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు) చెక్కులు పంపిణీ చేయనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్‌రాజు తెలిపారు. వాడనర్సాపురంలో ఉదయం 10 గంటలకు చెక్కులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కిషోర్‌రాజు కోరారు.

పల్లెలకు నిధుల వెల్లువ

- 15వ ఆర్థిక సంఘం రెండో దశ నిధుల విడుదల
- తొలి దశలో రూ.40.91 లక్షలు, రెండో దశలో రూ.47.62 లక్షలు
- మండల పరిషత్‌కు రెండు దశల్లో రూ.20.25 లక్షలు
- గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలకు అవకాశం



ఏటికొప్పాక మేజర్ పంచాయతీలో గ్రామ సచివాలయాల సముదాయం

యలమంచిలి రూరల్: పంచాయతీలకు ఆర్థిక దన్ను కల్పించేలా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి కారణంగా అభివృద్ధికి నోచుకోని పల్లెల రూపురేఖలు నేడు జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలతో మారుతున్నాయి. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు అందుబాటులోకి రావడంతో గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం, తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులు చేపట్టే అవకాశం వచ్చింది. గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాలు ఏర్పడి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా మండలంలో 17 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రెండు దశల్లో 88.53 లక్షల రూపాయలను ప్రభుత్వం గ్రామ పంచాయతీల ఖాతాలకు నేరుగా జమ చేసింది.

గ్రామ పంచాయతీల వారీగా మంజూరైన నిధులు

పంచాయతీ	తొలి దశ (రూ.లక్షల్లో)	రెండవ దశ
ఏటికొప్పాక	12,08,629	12,08,716
బయ్యవరం	52,499	1,74,410
లక్కవరం	34,857	1,15,800
జంపపాలెం	96,270	2,41,539
క్రిష్టాపురం	1,62,123	2,52,342
పోతురెడ్డిపాలెం	1,23,592	1,81,246
షేకిళ్లపాలెం	2,56,335	2,56,352
గూండ్రుబిల్లి	1,00,458	1,10,530
ములకలాపల్లి	1,75,680	1,75,692
పులపర్తి	3,88,837	4,15,268
రుక్మిణీపురం	1,85,554	1,85,567
లైనుకొత్తూరు	2,37,677	2,37,696
తురంగలపాలెం	1,37,687	1,37,696
పురుషోత్తపురం	2,53,028	2,53,047
పద్మనాభరాజుపేట	2,67,415	2,76,576
రేగుపాలెం	3,55,203	3,55,229
కొత్తలి	55,617	1,84,768

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల ఆధారంగా పనులు

2011 జనాభా లెక్కల ప్రాతిపదికన ఆయా గ్రామ పంచాయతీల ఖాతాల్లో పీఎఫ్ఎంఎస్(పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) ద్వారా నిధులు జమ అయ్యాయి. ఈ నిధులతో గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలతో పాటు పారిశుధ్య పనులు, వివిధ రకాల ఛార్జీల చెల్లింపులు,చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, వీధి లైట్లు, తాగునీటి సరఫరా, సిబ్బంది జీత భత్యాలు తదితరాలకు వాడుకోవచ్చు. గ్రామ పంచాయతీలతో పాటు మండల పరిషత్తులకు కూడా 15వ ఆర్థిక సంఘం నిధులు ఖాతల్లో జమ అయ్యాయి. యలమంచిలి మండల పరిషత్ కు 2023-24 ఆర్థిక సంవత్సరం రెండో దశ నిధులు రూ.10.12 లక్షలు మంజూరయ్యాయి. తొలి దశలో ఇదివరకే సుమారుగా రూ.10.13 లక్షలు జమ అయ్యాయి. వచ్చే రెండు నెలల్లో మండలంలోని అన్ని పంచాయతీలకు మరిన్ని నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. ఈ నిధులు అందుబాటులోకి వస్తే పంచాయతీల్లో అభివృద్ధి పనులు వేగం పుంజుకునే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా విడుదలైన నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతోనూ అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం మంజూరైన నిధుల ఖర్చులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణ ఉంటుంది. పంచాయతీల్లో వివిధ ఖర్చులకు సంబంధించిన బిల్లులకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రామ స్వరాజ్య ఈ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేయాలి



ప్రభుత్వం ద్వారా విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేయాలి. నిధుల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చాం. ప్రాధాన్యతా మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలి. ఈ నిధులు గ్రామ పంచాయతీలకు ఎంతగానో ఉపయోగపడతాయి.

–కె.అప్పలనాయుడు, ఎంపీడీవో, యలమంచిలి

నిధుల విడుదల హర్షణీయం



ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడం హర్షణీయం. వేసవి సమీపిస్తున్న తరుణంలో నిధులు రావడం వల్ల గ్రామ పంచాయతీల్లో పరిష్కారం కోసం ఎదురు చూస్తున్న అత్యవసర పనులు చేపట్టడానికి వీలుంటుంది. పనులను పారదర్శకంగా ఖర్చు చేసేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయడం మంచిదే. ప్రభుత్వానికి ధన్యవాదాలు.

–రాజాన శేషు, వైస్ ఎంపీపీ

ప్రజలకు చేరువగా జగనన్న పాలన



సమన్వయకర్త కంబాల జోగుల్ని అభినందిస్తున్న నాయకులు

పాయకరావుపేట : రాష్ట్రంలో ప్రజల వద్దకే పాలన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని, ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసి, అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మంగవరం, అరట్లకోట గ్రామాల్లో నాయకులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు నాయకులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా కంబాల జోగులు మాట్లాడుతూ పార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలను, అభివృద్ధి పనులను ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేయడానికి ఆయా రాష్ట్రాల పాలకులు చొరవ చూపుతున్నారన్నారు. విద్యార్థులకు అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యా దీవెన, జగనన్న గోరుముద్ద, విద్యాకానుక, నాడు-నేడు ద్వారా పాఠశాలలు అభివృద్ధి చేయడం ఎంతో గర్వకారణమన్నారు. ప్రతి గ్రామంలోను గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా అందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ, వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలు చేయడం జరుగుతుందన్నారు. పేదలు కార్పొరేట్ ఆసుపత్రుల బారిన పడకుండా మెరుగైన వైద్యం కోసం ఆరోగ్య శ్రీ పథకం ద్వారా 3 వేల రకాల రోగాలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. అవసరమైన వారికి కార్పొరేట్ ఆస్పత్రిలో రూ.25 లక్షలు వరకు వైద్య ఖర్చులు ప్రభుత్వమే ఆర్థిక సాయం ఎంతో గర్వకారణమన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు, రైతులు మండల కేంద్రాలకు వెళ్లకుండా ప్రతి గ్రామంలోను సచివాలయం, రైతు భరోసా కేంద్రం, పీహెచ్‌సీలను ఏర్పాటు చేసి అధికారులను గ్రామాల్లో విధులు నిర్వహించే విధంగా ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో వుండి సమస్యలు పరిష్కరించే విధంగా పాలన సాగిస్తున్నారన్నారు. అనంతరం సమన్వయకర్త కంబాల జోగులుకు నాయకులు సాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు. రానున్న ఎన్నికల్లో అందరం కలిసి పని చేసి, మరలా జగన్‌మోహన్ రెడ్డినే ముఖ్యమంత్రిని చేయాలన్నారు. సంక్షేమ పథకాలు యథాప్రకారం కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా మంగవరం గ్రామంలో మండల పరిషత్ గ్రాంట్ నుంచి రూ.2 లక్షలతో నిర్మించే రోడ్డుకు కంబాల జోగులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, గ్రామ సర్పంచ్ వంగలపూడి సరస్వతీ రామారావు, ఎంపీటీసీ గూటూరు విజయలక్ష్మి రామగోవిందు, పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు సూరకాసుల అన్నవరం, స్థానిక నాయకులు దేవవరపు సత్యనారాయణ, దేవవరపు రమణారావు, తూము రాజాబాబు, వేపాకాయల అప్పారావు, తూము రమణ, గర్లంక వెంకటూరి పెనుమత్స నాగేశ్వరరావు, కోనే పుత్రరావు, బొడ్డా శ్రీదేవి, అడపా శ్రావణి, కొంతం వరలక్ష్మి పాల్గొన్నారు.

రీ సర్వేలో అవకతవకలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధిత రైతులు

నక్కపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూముల రీసర్వే సిబ్బంది, అవకతవకలకు పాల్పడి తమ భూములను వేరొక రైతుల పేరున నమోదు చేశారని పలువురు రైతులు సోమవారం స్పందనలో తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. న్యాయంపూడిలో జాతీయ రహదారికి ఆనుకుని సర్పీపట్నానికి చెందిన విజయ్‌కుమార్‌కు 1.50 సెంట్లు భూమి ఉంది. ఈ భూమిలో కొంత జాతీయరహదారి విస్తరణలో పోయింది. మిగిలిన భూమిని ఇతని పేరున గతంలోనే రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసి పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేశారని, అయితే రీ సర్వేలో సుమారు ఎకరం భూమిని పొరుగు రైతు పేరున నమోదు చేసి పట్టాదారు పాసుపుస్తకం, ఎల్‌పీ నంబర్ కూడా జారీ చేశారని విజయకుమార్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్, సర్వేయర్లు పొరుగు రైతులతో కుమ్మక్కయి లక్షలాది రూపాయలు తీసుకుని తమకు అన్యాయం చేశారని ఆరోపించారు. నల్లమట్టిపాలెం, బుచ్చిరాజుపేట గ్రామాలకు చెందిన అప్పారావు, కృష్ణ అనే రైతులు కూడా తమ భూములను వేరొక రైతుల పేరున నమోదు చేశారని డీటీ, సర్వేయర్లపై ఫిర్యాదు చేశారు. ఆయా ఫిర్యాదులపై విచారణ జరిపిస్తామని తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్ల బాబూరావు ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టరూ..

మునగపాక : పూడిమడక రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నేత లోకనాథం కోరారు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న రహదారి అధ్వానంగా ఉండడంతో పలు చోట్ల సోమవారం మానవహారాలు నిర్వహించారు. తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అళ్ల మహేశ్వరరావు, పరశురామ్, మొల్లేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శీరంకు పరామర్శ



శీరం నరసింహమూర్తిని పరామర్శిస్తున్న జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

ఎస్.రాయవరం : రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్న వైఎస్సార్‌సీపీ నక్కపల్లి మండల అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి త్వరగా కోలుకోవాలని జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆకాంక్షించారు. అడ్డురోడ్డులో నరసింహమూర్తి ఇంటి వద్ద ఆయనను బొడ్డేడ ప్రసాద్ సోమవారం పరామర్శించారు. రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న నరసింహమూర్తికి ప్రభుత్వ పెద్దలు అండగా నిలిచారన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయాన్ని చేశారన్నారు. నరసింహమూర్తి త్వరగా కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. నరసింహమూర్తిని పరామర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు లొడగల చంద్రరావు, జనపరెడ్డి శేషారత్నం పాల్గొన్నారు.

ఫార్మా మార్కెటింగ్‌లో ఎన్నో అవకాశాలు



అతిథికి జ్ఞాపికను బహుకరిస్తున్న విజయ్ ప్రకాష్

పాయకరావుపేట : స్థానిక స్పేసెస్ డిగ్రీ కళాశాలలో సిస్టోపిక్ లైబొరేట్రిస్ (న్యూఢిల్లీ) సోమవారం డ్రగ్స్ సేల్స్, మార్కెటింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిస్టోపిక్ లైబొరేట్రిస్ ప్రైవేట్ లిమిటెడ్ జోనల్ సేల్స్ మేనేజర్ ఎం.వెంకటరమణ పాల్గొని బీఎస్సీ (కెమిస్ట్రీ) విద్యార్థులకు ఫార్మా డ్రగ్స్ సేల్స్ అండ్ మార్కెటింగ్‌లో అవకాశాలు వివరించారు. కళాశాల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుని ఉన్నతమైన స్థానాన్ని అధిరోహించాలని సూచించారు.

పీవీకి భారతరత్న రాష్ట్రానికే గర్వకారణం

- త్వరలో యలమంచిలిలో ఆయన కాంస్య విగ్రహం
- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు
- పీవీకి ఘన నివాళులు



పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, సుకుమారవర్మ

యలమంచిలి : భారతదేశంలో ఆర్థిక సంస్కరణల పితామహుడు, భూ సంస్కరణలో విలక్షణ మార్పులు తీసుకువచ్చిన గొప్ప ప్రజ్ఞాశాలి పీవీ నరసింహారావు అని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు కొనియాడారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు ఇటీవలే కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడంతో సోమవారం యలమంచిలి పట్టణంలో పీవీ నరసింహారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీవీ నరసింహారావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణలో వంగర గ్రామంలో పుట్టి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా విశేష సేవలందించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అవసాన దశకు చేరుకున్న దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరులూదారని, ఆయన తీసుకువచ్చిన అనేక సంస్కరణలు దేశానికి కొత్త దారిని చూపించాయని, భూ సంస్కరణల్లో నూతన మార్పులు తీసుకువచ్చారని, డ్వాక్రా సంఘాలను పీవీ హయాంలోనే స్థాపించడం జరిగిందని తెలిపారు. బహుభాషావేత్త, రాజనీతిజ్ఞుడు అయినటువంటి పీవీకి దేశ అత్యున్నత భారతరత్న పురస్కారం రావడం ఆంధ్ర రాష్ట్రం గర్వించతగిన విషయమని అన్నారు. యలమంచిలి పట్టణంలో ఉన్న పీవీ నరసింహారావు కాంప్లెక్స్ వద్ద ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్ మున్సిపల్ వైస్ చైర్మన్‌లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వరావు, యలమంచిలి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, పట్టణ సచివాలయ కన్వీనర్ కర్రి శివ, కొక్కిరాపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మళ్ల కొండబాబు, ఏటికొప్పాక వైఎస్సార్‌సీపీ నాయకులు సేనాపతి రాము, బ్రాహ్మణ సంఘం సభ్యులు సోమేశ్వరరావు, పలువురు వక్తలు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలకు గురికావద్దు

మునగపాక : ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పి.ప్రసాదరావు కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకొని మోసాలకు పాల్పడుతుంటారన్నారు. అతి తక్కువ వడ్డీకే లోన్ ఇస్తామంటూ వచ్చే ఫోన్‌కాల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వచ్చే ఫేక్ మెసేజ్‌లను నమ్మి మోసపోరాదన్నారు. బ్యాంక్ క్రెడిట్, డెబిట్ కార్డులకు సంబంధించిన వివరాలను ఇతరులతో పంచుకోవడం సరికాదన్నారు. లోన్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం గాని, ఆన్‌లైన్ లోన్ యాప్‌ల జోలికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎటువంటి అనుమానాలు వచ్చినా 9440796087 ఫోన్ నంబరును సంప్రదించాలని ప్రసాదరావు కోరారు.

పాయకరావుపేట : విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా వుండాలని ఎస్ఐ బి.జోగారావు అన్నారు. మంగవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మోటారు సైకిల్ పై డ్రైవింగ్ రూల్స్ తెల్సుకోవాలన్నారు. ఏవిధమైన వ్యసనాలకు అలవాటు పడవద్దని అవగాహన కల్పించారు.

ఉపాధి హామీ ద్వారా గ్రామాల్లో అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి పేర్కొన్నారు. మునగపాక మండల పరిషత్ హాలులో సోమవారం 16వ విడత సామాజిక తనిఖీ కో-ఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో భాగంగా 2022-23 సంవత్సరంలో జరిగిన పనులకు రూ.7.53 కోట్లు ఖర్చు జరిగిందన్నారు. 15 రోజుల పాటు సామాజిక తనిఖీ బృందం మండలంలోని 26 గ్రామాల్లో పర్యటించి జరిగిన పనులకు సంబంధించి వేతనదారుల నుంచి సమాచారం సేకరిస్తారన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రజా వేదిక ఏర్పాటు చేస్తామన్నారు. ఉపాధిహామీ పథకం ఏపీవో ఎరకయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో మన్మథరావు, పంచాయతీ రాజ్ ఏఈ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధిహామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

23 మద్యం సీసాలు స్వాధీనం



పందూరులో పట్టుబడిన మద్యం బాటిళ్లతో ఎస్ఐ రామయ్య

మునగపాక : మునగపాక శివారు అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి 23 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మునగపాక శివారులో మద్యం విక్రయిస్తున్నట్టు అందిన ఫిర్యాదుమేరకు ఎస్ఐ ప్రసాదరావు సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో 6 మద్యం సీసాలతో ఒకరు, అలాగే 17 మద్యం సీసాలతో మరొకరు పట్టుబడ్డారు. ఈ మేరకు 23 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

పందూరు గ్రామంలో...

కోటఉరట్ల : పందూరు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేసినట్టు ఎస్ఐ రామయ్య సోమవారం తెలిపారు. గ్రామంలో భీముని రాజుబాబు ఇంటివద్ద మద్యం విక్రయిస్తున్నట్టు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో రూ.4350 విలువ చేసే 29 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రాజుబాబును అదుపులోనికి తీసుకున్నామన్నారు.

కష్టపడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్

ఎస్.రాయవరం : పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. అడ్డురోడ్డులో పాయకరావుపేట ఇన్‌చార్జ్ కంబాల జోగులు క్యాంపు కార్యాలయంలో సోమవారం స్థానిక విలేకర్లతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ బలమైన పార్టీగా అవతరించిందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలు ఒంటరిగా పోటీ చేసే సత్తాలేక తోక పార్టీలతో పొత్తులు పెట్టుకుని ఎన్నికలకు సిద్ధమవుతున్నారని చెప్పారు. నైతికంగా ప్రతి పక్షాలు వైఎస్సార్‌సీపీ గెలుపుని ఒప్పుకున్నారన్నారు. అయితే ఉనికిని కాపాడుకునేందుకు పోటీలో నిలుస్తున్నారన్నారు. చంద్రబాబుతో కలిసిన ఏ ఒక్కరినీ ఎదగనిచ్చే నైజం చంద్రబాబుకి లేదని ఎద్దేవా చేశారు. నిత్యం ప్రజల్లో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ధైర్యంగా ఓటు అడిగే హక్కు జగన్‌మోహన్ రెడ్డి కల్పించారన్నారు. చెప్పిన ప్రతి మాట నెరవేరుస్తూ ప్రజల హృదయాల్లో నిలిచారన్నారు. పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు రాజ్యసభ ఇస్తానని చెప్పి ఇవాళ నామినేషన్ వేయించారన్నారు. మాట ఇస్తే మడమ తిప్పరు అనేందుకు నిదర్శనం మరోమారు రుజువైందన్నారు. పాయకరావుపేటకు ఇన్‌చార్జ్‌గా వచ్చిన కంబాల జోగులతో నియోజకవర్గ నాయకులు వర్గ విభేదాలు లేకుండా పని చేసేందుకు ముందుకు వచ్చారన్నారు. పాయకరావుపేట అత్యధిక మెజార్టీ వచ్చే దిశగా ఇక్కడ నాయకత్వం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ కంబాల జోగులు, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, పాయకరావుపేట, ఎస్.రాయవరం మండల పార్టీ అధ్యక్షుడు చిక్కాల రామారావు, బొలిశెట్టి గోవిందరావు, రాష్ట్ర అదనపు కార్యదర్శి దత్తుడు సీతబాబురాజు, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, కుమార్‌రాజా, నల్లపరాజు వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం



మాజీ సర్పంచ్ చినఅప్పలనాయుడు

ఎస్.రాయవరం : ఉప్పరాపల్లి మాజీ సర్పంచ్ శానాపతి చిన అప్పలనాయుడు సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. 1995 నుంచి రెండు దఫాలు గ్రామ సర్పంచ్‌గా సేవలందించిన చిన అప్పలనాయుడు మొదట కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ అవిర్భావంతో ఆ పార్టీలో సేవలందించారు. గత ఏడాది డిసెంబర్ నెలలో ఇంటివద్ద కాలుజారి పడిపోయిన అప్పలనాయుడు చికిత్స తీసుకుంటూ కోలుకుంటున్నారు. సోమవారం ఆకస్మికంగా మృతి చెందడం పట్ల కుటుంబ సభ్యులు దుఃఖసాగరంలో మునిగారు. ప్రస్తుతం ఆయన కుమారుడు శానాపతి శ్రీరాములు వైఎస్సార్‌సీపీలో ఉంటూ గ్రామ సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. చిన అప్పలనాయుడు మృతి పట్ల వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, పలు గ్రామాల సర్పంచ్‌లు పాలపర్తి పాపారావు, భూపతి అప్పారావు, కొప్పిశెట్టి సత్యం, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు.